నేటి దినపత్రిక
సూర్య
18వ
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
గురువారం,9 జనవరి 2025 8 పేజీలు


# నర్సాపురం అభివృద్ధికి తోడ్పడండి

**- మంత్రి లోకేష్‌ను కోరిన విప్ నాయకర్**



**మంగళగిరి/నరసాపురం,మేజర్‌న్యూస్:** మంగళగిరి క్యాంప్ కార్యాలయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ప్రభుత్వ విప్ నర్సాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నరసాపురం నియోజకవర్గంలో ఉన్న సమస్యలను వివరించి పరిష్కారం అయ్యేలాగా చర్యలు తీసుకుని నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని నాయకర్ కోరారు. గత వైసిపి పాలనలో నిలిపివేసిన కీలకమైన పనులకు నిధులు మంజూరు చేయించాలని,తద్వారా కూటమి ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేలాగా చర్యలు చేపట్టాలని మంత్రి లోకేష్‌ని కోరారు.

## సమర్ధవంతంగా

# అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు

**- జడ్‌పి స్థాయి సంఘ సమావేశంలో జెడ్పి చైర్ పర్సన్ పద్మశ్రీ**





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఆర్‌అండ్‌బి రహదారుల పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని జిల్లా ప్రజాపరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ చెప్పారు. బుధవారం స్థానిక జిల్లా ప్రజాపరిషత్ చైర్ పర్సన్ ఛాంబర్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా 1 నుండి 7వరకు గలస్థాయి సంఘం సమావేశం జరిగింది. ఈసమావేశంలో ఎమ్మెల్సీ గోపిమూర్తి, ప్రభుత్వ విప్ తాడేపల్లిగూడెం శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాసరావు, ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి),ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు, నర్సాపురం శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్, జెడ్పిటిసి సభ్యులు,వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో నిర్వహిస్తున్న ఆర్‌అండ్‌బి రహదారులు పనుల పురోగతి, ఆర్‌డబ్ల్యూఎస్ స్కీం కింద అమలు చేస్తున్న మంచినీటి పథకాల ఏర్పాటు, ఇరిగేషన్‌కు సంబంధించి కాల్వలకు నీటి విడుదల,తాత్కాలికమరమ్మత్తులు,ఎంపి ల్యాడ్స్ వినియోగం,విద్యుత్‌కు సంబంధించిన సోలార్ వినియోగం, జిల్లాలో ఏర్పాటు చేస్తున్న మోడల్ సోలార్ గ్రామాలు, రైతులకు ఉచిత కరెంట్, జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుకు సంబంధించిన అంశాలు, మధ్యాహ్న భోజన పథకం తదితర శాఖల ప్రగతి తీరును సమావేశంలో చర్చించి తగు సూచనలు చేశారు. శాసన మండలి సభ్యులు గోపిమూర్తి మాట్లాడుతూ పాఠశాల విద్యాప్రమాణ స్థాయిపెంచే దిశగా విద్యాశాఖ అధికారులు కృషిచేయాలన్నారు.

ఏలూరు ఎమ్మెల్యేబడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమఫలాలు ప్రజలకు చేరువ చేయడంలో అధికారులు ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఏర్పాటుపై ప్రజలకు అవగాహన పెంచేలాగా విస్తృతప్రచారంచేయాలని తాడేపల్లి గూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ పూర్తయిన అభివృద్ధి పనులు ప్రారంభం, రాబోయే రోజుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఈనెలలోనే శంఖుస్థాపన కార్యక్రమాలు చేసేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. సమావేశంలో జెడ్పి సిఇఓ కె.సుబ్బారావు, పలువురు జెడ్పిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఎస్సీలకు రూ.22.38, బిసిలకు రూ.39.61కోట్లు

- బి.సి యేతర అల్పాదాయ వెనుకబడిన కులాలకు రూ.7.1 కోట్లు
- కాపు కార్పొరేషన్ ద్వారా 694 యూనిట్లకు రూ.13.88 కోట్లు
- ఫిబ్రవరి నెలాఖరులోపుగా బ్యాంకర్లు నూరు శాతం రుణాలు ఇవ్వాలి

**భీమవరం,మేజర్‌న్యూస్:** ఎస్సి,బిసి కార్పొరేషన్ల ద్వారా వివిధ వర్గాల ప్రజలకు అందించే రుణాలను బ్యాంకర్లు నూరు శాతం మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన బీసి, ఎస్సీ కార్పొరేషన్ల ద్వారా వివిధ వర్గాలకు మంజూరు చేసే రుణాలపై ఎస్సీ,బిసి కార్పొరేషన్లు, ఎల్‌డిఎం,డిఆర్‌డిఎ,మెప్మా, పరిశ్రమలశాఖల అధికారులు,వివిధ బ్యాంకర్లుతో సమావేశమై సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఎస్సి,బీసీ వర్గాల అభ్యున్నతికి, వారు ఆర్థికంగా స్థిర పడేందుకు ఎస్సీ వర్గాలకు 714 యూనిట్స్‌కు రూ. 22.38 కోట్లు సబ్సిడీ రుణాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే సెర్ప్ ద్వారా 120 ఆటోలను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. బిసీ వర్గాల స్వయం ఉపాధి పథకాలకు 1,901 మందికి రూ. 36.49 కోట్లు, జనరిక్ మెడికల్ షాప్స్ ఏర్పాటుకు 39 యూనిట్స్‌కు రూ. 3.08 కోట్లు, అలాగే బి.సి యేతర వర్గాలకు చెందిన

- తరువాయి 2లో..

# అంబరాన్నంటిన ఎమ్మెల్యే బాలరాజు పుట్టినరోజు వేడుక

**- అభిమానులతో కిక్కిరిసిన సభా ప్రాంగణం**



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు నివాసం వద్ద ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుక ఘనంగా జరిగింది. నియోజకవర్గంలో 7మండలాల నుండి కూటమి నాయకుల రాకతో సభా ప్రాంగణం కిక్కిరిసింది. మొదటగా వేద పండితుల వేదమంత్రాల నడుమ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గా ఏజన్సీ టైగర్ కరాటం రాంబాబు,ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్,ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాస్,దెందులూరు శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్, గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్‌రాజు, నియోజకవర్గంలోని అన్ని శాఖలలోని ప్రధాన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. అభిమానులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో చిర్రి చారిటబుల్ ట్రస్ట్‌ని ప్రారంభించారు. అలాగే జిల్లా కార్యదర్శి,ప్రధాన కార్యదర్శులు కరాటం సాయి, గడ్డమణుగు రవికుమార్ ఆధ్వర్యంలో సిబిఆర్ న్యూస్ చానెల్‌ను ఆవిష్కరించారు. సిబిఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి మండల అధ్యక్షులు పసుపులేటి రాము,బుట్టాయగూడెం మండల అధ్యక్షులు మెట్ట బుచ్చిరాజు. పోలవరం మండల అధ్యక్షులు గుణపర్తి చిన్ని,కొయ్యల గూడెం తోటరవి,టి. నరసాపురం అడపా నాగరాజు,కుక్కునూరు మండల అధ్యక్షులు యుగంధర్,వేలేరుపాడు మండల అధ్యక్షులు ఆదినారాయణ, సరిపల్లి సత్యనారాయణ రాజు,నియోజకవర్గంలోని కూటమి నాయకులు కార్యకర్తలు,వీరమహిళలు, నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారుల సిబ్బంది పాల్గొని జయ ప్రదం చేసారు.



## గిరిజన సంప్రదాయంతో

# ఎంపీ మహేష్‌కి స్వాగతం

**బుట్టాయిగూడెం,మేజర్‌న్యూస్:** గిరిజన సంప్రదాయంతో ఎంపీ పుట్టా మహేష్‌కి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే చిర్రిబాలరాజు పుట్టినరోజు వేడుకలు సందర్భంగా విచ్చేసిన ఎంపీ పుట్టామహేష్ యాదవ్‌ని బుట్టాయిగూడెం తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు నల్లూరి కృష్ణ మోహన్ గిరిజన సాంప్రదాయం కొమ్ము తలపాగాతో ఘన స్వాగతం పలికారు.

# 'అడపా' ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలరాజు పుట్టినరోజుకు భారీగా తరలిన జనసేన శ్రేణులు





**టీ.నర్సాపురం, మేజర్ న్యూస్ :** పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పుట్టినరోజు వేడుకలు బుధవారం ఆయన స్వగ్రామమైన జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీ.నర్సాపురం జనసేన పార్టీ అధ్యక్షులు అడపా నాగరాజు ఆధ్వర్యంలో 25 ట్రాక్టర్లు 50 కార్లు 150 మోటార్ సైకిల్ భారీర్యాలీ నిర్వహిస్తూ వెళ్లారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ అధ్యక్షులు అడపానాగరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలరాజు పుట్టినరోజు ఘనంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మండలం నుండి తీసుకెళ్లిన 50 కేజీల భారీ బర్త్డే కేకును బరింకలపాడులో ఎమ్మెల్యే చేత కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ నవీన్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణ గౌడ్, రాష్ట్ర కార్యదర్సులు జయ్యవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, నల్లూరి చలపతి,బొంతు సత్యనారాయణ వెలిది నాగబాబు,పిన్నమనేని మధు, నాళం కాశి, జోనుబోయిన సోంబాబు అద్దంకి జగ్గారావు, పేరం రాంబాబు, మండం ఆదిత్య కుమార్,పాలేటి సత్యనారాయణ ,వేల సంఖ్యలో జనసేన,తెలుగు దేశం,బిజెపి కార్యకర్తలు నాయకులు అభిమానులు తరలి వెళ్లారు.

# అంధుల్లో ఉత్తేజాన్ని నింపిన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు



**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లకు అభినందనలు తెలిపిన విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగుల సంక్షేమ సంఘం. ఏలూరులో మంగళ వారం నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగుల సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి. వీరభద్రరావు, కె.మధన్ బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ,జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి లకు తమ సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. దివ్యాంగులకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి భరోసా ఇవ్వడం విభిన్న ప్రతి భావంతులకు ఎంతో మనోధైర్యాన్ని కల్పించిందన్నారు. తమ కార్యక్రమానికి హాజరై తమపట్ల ఎంతో ఆధరణచూపుతున్న జిల్లా యంత్రాంగానికి మరోమారు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు.

## దివ్యాంగుల పెన్షన్లు పరిశీలన



**భీమవరం, మేజర్‌న్యూస్:** ఆచంట మండలం బాలంవరపాలెం పంచాయతీలో పెన్షన్ రీ వెరిఫికేషన్ లో భాగంగా బుధవారం డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, వైద్య బృందం రూ.15 వేలు పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారులను వారి ఇంటి వద్దకే వెళ్లి పరిశీలించడం జరిగిందని డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ తెలిపారు. జిల్లాలో మంచానికి, వీల్ చైర్ కి పరిమితమైన 231 మంది రూ.15 వేలు పెన్షన్ అందుకోగా, నేటి వరకు 200 పెన్షన్ దారుల ఇంటి వద్దకే తనిఖీ బృందం వెళ్లి పరిశీలించడం, యాప్ లో వివరాలను నమోదు చేసుకోవడం జరిగిందని, ఇంకా 31 పెన్షన్లను తనిఖీ చేయాల్సి ఉందని డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ తెలిపారు.

# 10 నుండి ఎంబర్ మన్నార్ స్వామి ఉత్సవాలు



నర్సాపురం,మేజర్ న్యూస్: పురాతన ఆలయం శ్రీశ్రీశ్రీ ఆది కేశవ ఎంబర్ మన్నార్ స్వామి ఉత్సవాలు ఈనెల 10వ తారీకు నుండి ప్రారంభం కానున్నాయి. ముక్కోటి ఏకాదశి ని పురస్కరించుకొని పదవ తేదీన ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు కోవెలగుడి పాలకమండలి సన్నాహాలు చేస్తోంది.ఆలయ వంశపారపర్య ధర్మకర్త పుప్పాల వెంకటకృష్ణారావు ఆలయంలో బుధ వారం విలేకరులతో మాట్లాడారు. 1786 సంవత్సరంలో తమ పూర్వీకులు అయిన పుప్పాల నాయుడు స్వామిని ప్రతిష్టించారని అప్పటినుండి తమ వంశీకులు ఎంబర్ మన్నార్ స్వామి సేవలో కొనసాగుతున్నారని తెలిపారు. ఈ స్వామి ఆలయం తమిళనాడులోని శ్రీ పెరంబదూర్‌లో ఉన్నదని,ఆ తరువాత ఇక్కడే ఉందని ఆయన తెలిపారు.ఈ సంవత్సరం స్వామి వారి ఉత్సవాలు కళ్యాణం పెద్దింటి రామ్మోహన్ ఆచార్యులు ఆధ్వర్యంలో జరగనున్నదని కృష్ణా రావు తెలిపారు. భక్తులందరూ ఈ ఉత్సవాలలో పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి ఆశీర్వచనాలు పొందాలని ఆయన అన్నారు. దర్శనానికి ప్రసాదాలకు ఎటువంటి రుసుము ఉండబోదని ఆయన తెలిపారు.పెద్దింటి రామ్మోహన్ ఆచార్యులు వేద పండితులు పాల్గొన్నారు.

# దేహ ధారుడ్య పరీక్షల్లో 313 మంది పోలీస్ అభ్యర్థులు ఎంపిక



**ఏలూరు,మేజర్ న్యూస్ :** పోలీస్ కానిస్టేబుల్ దేహ ధారుడ్య పరీక్షలు బుధవారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం, పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ పర్యవేక్షణలో జిరిగింది. పురుష దేహ ధారుడ్య పరీక్షల నిర్వహణ సాంకేతిక పరిజ్ఞానం, సీ.సీ.టీవీ పర్యవేక్షణ, డ్రోన్ కెమేరాలు ద్వారా పారదర్శకత ,నిష్పక్షపాతంగా దేహ ధారుడ్య నిర్వహణ చేస్తున్న పోలీసు అధికారులు. ఎపి ఎస్ఎల్‌పిఆర్‌బి వారు 600 మంది అభ్యర్థిలకు హాల్ టికెట్ ఇవ్వగా 459 మంది అభ్యర్థులు హాజరు కాగా వారిలో 313 మంది అభ్యర్థులు క్వాలిఫై అయ్యారు. దేహ ధారుడ్య పరీక్షలను ఎపి ఎస్ఎల్‌పిఆర్‌బి నిబంధనల ప్రకారం నిర్వహణ,అభ్యర్థుల పోటీ పరీక్షల కోసం అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏ.బి.ఓ. ఎస్.టి కమ్యూనిటీ సర్టిఫికెట్లను దేహ దారుడ్య పరీక్షలకు హాజరు అయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా తీసుకొనిరావలెను,అభ్యర్థులు వారి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను దేహ దారుడ్య పరీక్షలకు హాజరయ్యే వారు తప్పనిసరిగా తీసుకొనిరావలెను, ఆప్పిల్ చేసుకున్న అభ్యర్థులు 9వ తేదీ నిర్వహించే దేహ దారుడ్య పరీక్షలకు హాజరు కాగలరని జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ పోటీ పరీక్షలు డ్యూటీలకు జిల్లా అదనపు ఎస్పి ఎన్ సూర్యచంద్రరావు ,ఏఆర్ అదనపు ఎస్పి ఎన్.ఎస్.ఎస్ శేఖర్, ఈస్ట్ గోదావరి ఎస్పీ ఎల్ చెంచి రెడ్డి, ఎస్.బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు ,బి అది ప్రసాద్, డీఎస్పీలు ఇన్స్పెక్టర్లు,ఎస్ఐలు ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్సీలకు రూ.22.38, బిసిలకు రూ.39.61కోట్లు

మొదటిపేజి తరువాయి

కమ్మ, రెడ్డి, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ,ఇతర వెనుకబడిన కులాలకు స్వయం ఉపాధి పథకాలు కింద 215 మందికి రూ.3.73 కోట్లు, అలాగే జనరిక్ మెడికల్ షాప్స్ ఏర్పాటుకు 35 యూనిట్స్ కు రూ.2.92 కోట్ల సబ్సిడీ రుణాలను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. వీటితోపాటు కాపు కార్పొరేషన్ ఎంఎస్‌ఎమ్‌ఈ పథకం 694 యూనిట్లను నెలకొల్పేందుకు రూ.13.88 కోట్లు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గాలకు మంజూరు చేసే రుణాల్లో మూడు,నాలుగు చక్రాల పాసింజర్ ఆటోలు, నాలుగు చక్రాల గూడ్స్ ట్రక్,పాడి గేదలు, ఆవులు, మేకలు, గొర్రెలు, హెూటల్‌తో క్యాటరింగ్, శారీ పాలిషింగ్ ,రోలింగ్,బ్యూటీ పార్లర్,ఫోటో స్టూడియో,టూరిజం ఫోటోషూట్, వెజిటబుల్ షాప్, సెల్ ఫోన్ రిపేర్ షాప్, ఫ్యాన్సీ షాప్, ఐస్ క్రీమ్ పార్లర్,మెటల్ బ్రాస్ యూనిట్,జనరిక్ మెడికల్ షాప్, మొబైల్ ఫుడ్ స్టాల్,జ్యూట్ బ్యాగ్ మేకింగ్, టెక్స్టైల్ యూనిట్, పవర్ టిల్లర్, మినీ దాల్, రైస్‌మిల్, ట్రాక్టర్ తదితర యూనిట్లు నెలకొల్పుకునేందుకు బ్యాంకు లింకేజీ రుణాలను రూ.10 లక్షల వరకు అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే బీసీ వర్గాలకు వివిధ షాపులకు, జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటుకు సబ్సిడీ రుణాలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఓబిఎంఎంఎస్ పోర్టల్ నందు నేటి 8 నుండి జనవరి 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జనవరి 20 నుండి 24 వరకు మండల, మున్సిపల్ అధికారులు బ్యాంకర్స్‌తోకలిసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారన్నారు. ఈ నెల 26,27 తేదీల్లో దరఖాస్తులు తిరస్కరణలు ఉంటే తెలియజేస్తారని,అలాగే లక్ష్యానికి అనుగుణంగాఅవకాశం ఉంటే కొత్తవారిని చేర్చడం జరుగుతుందన్నారు. ఈ నెల 28 నుండి ఫిబ్రవరి 12వరకు వివిధ దశల్లో అనుమతి పొందిన అనంతరం బ్యాంకులకు డాక్యుమెంట్స్ సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 21నుండి ఫిబ్రవరి26మధ్య నియోజకవర్గాల వారిగా షెడ్యూల్ ప్రకారం రుణ మేళాలు నిర్వహించి ప్రజా ప్రతినిధుల ద్వారా అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.విజయ ప్రకాష్, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పుష్పలత, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఏ.నాగేంద్రప్రసాద్, డిఆర్డిఏ పిడి ఎంఎంఎస్ వేణుగోపాల్,జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు,మెప్మా అధికారినాని బాబు,వివిధ బ్యాంకుల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరికి పిఎం విశ్వకర్మ యోజన రుణాలు





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద అర్హులైన ప్రతీ ఒక్కరికీ రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బ్యాంకర్లు, అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం పీఎం విశ్వకర్మయోజన పథకం అమలుపై అధికారులు,బ్యాంకర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పీఎం విశ్వకర్మయోజన పథకం కింద 18 సాంప్రదాయక చేతివృత్తులకు వారి ఆర్థిక చేయూతకు రుణాలను మంజూరు చేయడం జరుగుతుందని,జిల్లాలో పీఎం విశ్వకర్మయోజన పథకం కింద 2458 మందికి మంజూరు చేసి శిక్షణ అందించడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులలో అర్హులైన వారికి రుణాలు అందించేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ కె.సుబ్బారావు, డిఆర్డిఏ పీడీ ఆర్. విజయరాజు, పరిశ్రమల శాఖ జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, నగరపాలక సంస్థ కమీషనర్ భానుప్రతాప్,జిల్లా పంచాయతి అధికారి కె.అనురాధ, ప్రభృతులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న చిన్నారుల సంక్రాంతి వేషాధారణ ప్రదర్శనలు






## – తెలుగుదనం ఉట్టిపడేలా విజ్ఞాన్ పాఠశాలలో ఏర్పాట్లు

**కైకలూరు,మేజర్ న్యూస్,** విజ్ఞాన్ స్కూల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపల్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో మంగళ,బుధవారం జరిగిన ఈ వేడుకలు చూపరులను ఆకట్టుకున్నాయి.తెలుగు సంక్రాంతి సంప్రదాయం ఉట్టిపడేలా విద్యార్థులు వివిధ రకాల ప్రదర్శనలు నిర్వహించారు.రంగవల్లులు, గొబ్బెమ్మలు,భోగిపండ్లు, ఎడ్లబండ్లు, కోడిపుంజులు, గంగిరెద్దులు, పిండివంటలు,హరిదాసులతో పాఠశాల ఆవరణ సందడిగా మారింది. విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు.పాఠశాల యాజమాన్యం తెలుగుదనం ఉట్టిపడేలా సంక్రాంతి ఏర్పాట్లు చేయడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. సంక్రాంతి పండుగ ముందే వచ్చేసిందా అన్నట్టు విద్యార్థులు సందడి చేశారు.సంక్రాంతి ఆటపాటలతో విద్యార్థులు కేరింతలు కొట్టారు.ప్రధానంగా కలియుగ దైవం వేషధారణలో విద్యార్థులు విశేషంగా అలరించారు. వేంకటేశ్వరస్వామి,గోదాదేవి కల్యాణం ప్రదర్శన చూపరులకు కనువిందు చేసింది. విద్యార్థుల ప్రదర్శనలకు తగ్గ సంగీతం ఏర్పాటు చేయడంతో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల అధిపతి జిపి రంగారావు,దుర్గ దంపతులు, ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కొవ్వలి చిత్రం,బియ్యపు గింజలపై ఆయన పేరు చెక్కిన గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత



**నరసాపురం, మేజర్న్యూస్:** పూర్వజన్మ సుకృతం వల్లే సూక్ష్మ కళా ప్రతిభ అబ్బుతోందని కొప్పినీడి విజయమోహన్‌కు ఈకళ వరించటం అభినందనీయమని కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్,తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతి రాజరామ్మోహన్‌నాయుడు అన్నారు. గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత విజయ మోహన్ బుధవారం కొవ్వలి రామ్మోహన్ నాయుడుని ఆయన నివాసంలో కలిసి తాను పెన్సిల్‌తో గీసిన కొవ్వలి రామ్మోహన్ నాయుడు చిత్రాన్ని దానితోపాటు బియ్యం గింజలపై చెక్కిన ఆయన పేరును బహుకరించారు. ఈ సందర్భంగా తాను ఈ కళా నైపుణ్యంలో సాధించిన అవార్డులను రివార్డులను నాయుడుకి వివరించారు. దీనిపై స్పందించిన కొవ్వలి మాట్లాడుతూ మైక్రో చిత్రకళ అనేది కేవలం వేళ్ళపై లెక్కించే చిత్రకళాకారులకే ఈ నైపుణ్యం ఉంటుందని అన్నారు. ఓర్పు నేర్పు సూక్ష్మ దృష్టి ఉంటేనే ఇది సాధ్యమన్నారు. ఏకాగ్రతతో చేసే పనికి చిత్రకళ నైపుణ్యం ఒక మచ్చుతునకగా అభివర్ణించారు.

ప్రస్తుతం విజయ మోహన్ లిఖితపూడి గ్రామ సచివాలయం నందు సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తూ,ఈ సూక్ష్మ కళలో రాణిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు అని అన్నారు. అనంతరం ఆయనను పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయమోహన్ తండ్రి కొప్పినీడి వరహాల రావు,తమ్మిశెట్టి బాబ్జి,కావలి నాని,కోటిపల్లి కన్నబాబు,ఆరేటి వేణు,ఆకుల భుజంగరావు,కళ్యాణ్, బందారు విశ్వమో హన్ కుమార్,మేడిద రాము,లక్కు శ్రీను,రేవు పద్మారావు,నందా రామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# రక్షిత మంచినీటి కేంద్రాన్ని పరిశీలించిన కమిషనర్



నరసాపురం, మేజర్ న్యూస్ : పురపాలక సంఘం లోని 2వ వార్డు శ్రీహరిపేట నందు గల ప్రధాన రక్షిత మంచి నీరు సరఫరా విభాగాన్ని మునిసిపల్ కమిషనర్ ఎం అంజయ్య బుధవారం పరిశీలించారు. మంచి నీటి చెరువు ప్రాంగణం అంతా పిచ్చి మొక్కలని తొలగించి,ఆలం, క్లోరిన్, సిబ్బంది హాజరు పట్టిలను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలు అంతా నీటిని చాలా పొదుపుగా జాగ్రత్తగా వాడుకోవాలి అన్నారు .రక్షిత మంచినీటి సరఫరా చేసే సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో డిఈ ప్రవీణ్ చంద్ర ఎఈ కిషోర్ పాల్గొన్నారు.

# జూదం వద్దు - సాంప్రదాయ క్రీడలు ముద్దు

**కలిదిండి,మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివకిషోర్,డి.ఎస్.పి డి శ్రావణ్ కుమార్, కైకలూరు రూరల్ సర్కిల్ సీఐ రవి కుమార్ ఆదేశాలపై కలిదిండి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఎస్ఆర్పి అగ్రహారంలో ప్రజలకు రానున్న సంక్రాంతి పండగ నేపథ్యంలో జూదాలు వద్దు సాంప్రదాయ క్రీడలు ముద్దు అనే నినాదంతో ప్రచార కార్యక్రమాలను కలిదిండి ఎస్సై వారి సిబ్బందితో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రజల ఆర్థిక అవసరాలకు హాని కలిగించి పేకాట కోడి పందాలకు పండగ రోజుల్లో దూరంగా ఉండాలని, అన్నారు. భవిష్యత్ తరాల వారికి సాంప్రదాయ క్రీడలను పట్ల మక్కువ కలిగే విధంగా పండగరోజులలో యువతకు సాంప్రదాయ క్రీడలైనటువంటి కబడ్డీ కోకో బాల్ బ్యాట్మెంటన్ వాలీబాల్ క్రీడలలో పోటీలు నిర్వహించి యువతలో సాంప్రదాయ క్రీడలను పాల్గొనేలాగా ప్రోత్సహించాలని అని అన్నారు. పేకాట కోడిపందాలకు పోలీసు వారి అనుమతులు ఉన్నాయని చెప్పే వారి మాటలు నమ్మవద్దని, పేకాట కోడిపందాలు నిర్వహణ చేసిన లేదా



పాల్గొన్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, పోలీస్ కేసులలో యువత ఉంటే వారి బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని ,కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్,కలిదిండి యస్ ఐ.వెంకటేశ్వరా రావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ పోటీలకు చాంబర్స్ విద్యార్థి దుర్గాప్రసాద్



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** స్థానిక బి ఆర్ఆర్ అండ్‌జికెఆర్ చాంబర్స్ డిగ్రీ ,పీజీ కళాశాలలో సెకండ్ బిబిఏ చదువుతున్న పులి దుర్గాప్రసాద్ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ మెన్‌చెస్ పోటీలకు నన్నయ్య యూనివర్సిటీ, రాజమహేంద్రవరం తరపున ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి . వెంకటేశ్వర రావు తెలియజేశారు. ఇటీవల నన్నయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల చెస్ కాంపిటీషన్లో పులి దుర్గ ప్రసాద్ నన్నయ్య యూనివర్సిటీ చెస్ టీమ్ కి ఎంపికైనారని తద్వారా ఈనెల 8 నుండి 11వ తేదీ వరకు చెన్నైలో వెల్ టెక్ యూనివర్సిటీలో జరుగు సౌత్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయ మెన్ చదరంగ పోటీలకు పాల్గొనే అవకాశం లభించుట కళాశాలకు గర్వకారణంగా ఉన్నదని కళాశాల చైర్మన్ కె.వి.ఆర్.నరసి ంహారావు అన్నారు ,క్రీడలు సాంస్కృతిక అంశాలలో కళాశాలలో తమవిద్యార్థులకు ప్రతిభాపాటవాలు నిలుపుకుంటున్నా రని అన్నారు. ఈ సందర్భంగా పులి దుర్గాప్రసాద్ను, పిడి బి అప్పారావు లను కళాశాల యాజమాన్యం అపోలో జి జీవిఎస్ అధ్యాపకేతర సిబ్బంది అభినందించినారు.

# రూ.19 లక్షలతో రహదారి మరమత్తు పనులు ప్రారంభం



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** స్థానిక లాకుల ప్రాంతంలో రూ.19 లక్షలతో దేశాలమ్మ గుడి వద్ద నుంచి పూలపల్లి వరకు ఆర్.అండ్.బి.రహదారి మరమత్తు పనులను మొదలుపెట్టారు. ఈ పనులను మాజీ ఎమ్మెల్యే అంగర రామ్మోహన్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు,బోణం చినబాబు,ఉన్నమట్ల ప్రేమ కుమార్,సెడగం సురేంద్ర,బిట్ట లక్ష్మీనారాయణ, తులా రామలింగేశ్వరరావు,ఆర్ అండ్ బి డి ఈ రమణ, జేఈ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాస రచన పోటీలు జయప్రదం చేయండి :పిడిఎస్‌యు



**ఏలూరు,మేజర్ న్యూస్:**సంక్రాంతి వేడుకల్లో భాగంగా పిడిఎస్‌యు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలను జయప్రదం చేయాలని పి.డి.ఎస్.యు నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పిడిఎస్‌యు కళాశాలలో వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు నగర అధ్యక్షుడు యం.యశ్వంత్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా విద్యార్థులు తప్పుదోవ పట్టకుండా సంక్రాంతి విశిష్టతను తెలుసుకోవడం కోసం 'సంక్రాంతి పండుగ విశిష్టత మారుతున్న క్రీడా విష సంస్కృతి 'అనే అంశం మీద ఈ నెల 9.10 తేదీలలో వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుందని యశ్వంత్ తెలిపారు. కావున ఈ వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు మొదటి ముగ్గురికి బహుమతులు కూడా అందించడం జరుగుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి ఎస్.సునీల్, నగర ఉపాధ్యక్షులు వై.శాంతి కిరణ్ కాలేజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# 10, 11 తేదీలలో శ్రీ వైయన్ కళాశాల 75 వసంతాల ఉత్సవాలు



– పాల్గొనేందుకు భారీగా తరలివస్తున్న పూర్వ విద్యార్థులు

**నర్సాపురం,మేజర్‌న్యూస్:** ప్రఖ్యాతగాంచిన శ్రీ యర్రమిల్లి నారాయణ మూర్తి కళాశాల 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 10,11 తేదీలలో ప్లాటినం జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు కళాశాల పాలకమండలి ఏర్పాట్లు చేస్తుంది. ఈ వేడుకలలో పాల్గొనేందుకు పూర్వ విద్యార్థులు భారీగా తరలి వస్తున్నారు. ఈ సందర్భంగా యాజమాన్యం బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణరావు మాట్లాడుతూ "రాష్ట్రంలోనే ఎంతో పేరుగాంచిన ఈ విద్యాలయం 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. తమ సంకల్పానికి బలం చేకూరుస్తూ పూర్వ విద్యార్థులు భారీ ఎత్తున ఈ వేడుకల్లో పాలు పంచుకునేందుకు సమాయత్తమయ్యారని వారు తమ జీవితాల్లో ఎంత ఉన్నత శిఖరాలకు ఎదిగిన ఎంత బిజీ లైఫ్ గడుపుతున్న తమకళాశాలను మరచిపోకుండా ఎర్రమిల్లి నారాయణమూర్తి కళాశాలకు ఒకచెరగని స్థానం ఏర్పాటు చేసుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని, తాను సెక్రటరీగా పదవి స్వీకరించిన దగ్గర నుండి కమిటీలోని ఇతర సభ్యులు అందరూ తనకు ఎంతో తోడ్పాటు అందించారని అందువల్లే కళాశాల ఇంత ఉన్నత స్థితికి చేరిందని అందుకు ఆయన అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అని అన్నారు. ఈ సమావేశంలో కళాశాల ట్రెజరర్ పొన్నపల్లి శ్రీరామారావు మాట్లాడుతూ 'ఎంతో ఉన్నత ఆశయాలతో స్థాపించబడిన ఈకళాశాల ఎందరో విద్యార్థిని విద్యార్థుల జీవితాన్ని తీర్చిదిద్దిందని,డాక్టర్ చినిమిల్లి సత్య నారాయణరావు 40సంవత్సరాలుగా సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా కొనసాగుతూ ఈ కళాశాలను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లడమే కాక ఎంతో అభివృద్ధి చేశారని 'ఆయన అన్నారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు అందే రామ సతీష్,పోలిశెట్టి రఘు రామారావు, గుడివాడ సాయి, రంగినీడి సుబ్బారావు,రెడ్డప్ప దవేజీ, కోటిపల్లి వెంకటేశ్వరరావు,కళాశాల ప్రిన్సిపల్ కనకారావు,పీజీ డైరెక్టర్ డాక్టర్ చింతరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాటినం జూబ్లీ చర్ ను విడుదల చేశారు.

# ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు





– ఆకట్టుకున్న రంగవల్లులు

**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** పట్టణ స్థాయిలో సంక్రాంతి సంబరాలు భాగంగా ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాస డీలక్స్ రోడ్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ పోటా పోటీగా వేసిన ముగ్గులు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ పోటీల్లో పట్టణం మొత్తం మీద 106 మంది పాల్గొనగా వరుసగా పదిమందిని విజేతలగా ఎంపిక చేశారు. విజేతలతో పాటు పోటీలో పాల్గొన్న వారందరికీ చీర, బహుమతులు అందజేశారు. వరుసగా విజేతలుగా నిలిచిన వారిలో అంగరం ప్రియాంక, అతికల భువనేశ్వరి, బందెల వసుంధర దేవి, సంగుల విజయలక్ష్మి, యరకం నాగమణి, ముద్దుర్తి పద్మావతి, సంగినీడి రోషిని ప్రియా, మారోజు హిమబిందు, గజ్జరపు వాసవి, బండి ఉమా, కొండేటి మేరీ జ్యోతి లు నిలిచారు. ముగ్గుల పోటీ న్యాయ నిర్ణేతలుగా గాదె శివకుమారి, లక్కింశెట్టి సునీత, అంజనీలు వ్యవహరించారు. ఈ సందర్భంగా పట్టణ టిడిపి అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్నెన రోజా రమణి లు మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు భాగంగా మహిళలను ప్రోత్సహించాలని ఉద్దేశంతో మంత్రి రామానాయుడు 11సంవత్సరాలుగా ముగ్గుల పోటీ నిర్వహించడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో నాయకులు కర్నేన గౌరు నాయుడు, పొట్నూరి శ్రీనివాస్, బిందుకోట దుర్గా మల్లేశ్వరి, బేరం శ్రీరామచంద్రమూర్తి, శేఖర్, పాలవలస తులసిరావు, ధనాన్ని సూర్యప్రకాష్, దుగ్గిన రాము, కొండేటి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# సైన్స్ ఫెయిర్‌లతో సృజనాత్మకత



– విశ్వకవి స్కూల్లో మ్యాథ్స్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**భీమవరం,మేజర్‌న్యూస్:** భీమవరంలోని విశ్వకవి సిబిఎస్‌ఈ స్టేట్ సిలబస్ స్కూల్లో మ్యాథ్స్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్,ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. విద్యార్థులు తయారుచేసిన మ్యాథ్స్ అండ్ సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ విశ్వకవి స్కూల్లో చదివిన విద్యార్థులు ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్స్, ఇంజనీర్లుగా అత్యున్నత స్థాయిలో ఉన్నారని అన్నారు. ఇటువంటి సైన్స్ ఫెయిర్‌లతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీయవచ్చునని అన్నారు.

విశ్వకవి స్కూల్ డైరెక్టర్ పొట్లూరి రఘుబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే అంజిబాబు దాదాపు 34 సంవత్సరాలుగా విశ్వకవి విద్య సంస్థకు ఆప్త మిత్రులని, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ గా అత్యుత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసి చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, చినఅమిరం గ్రామ మాజీ సర్పంచ్ బుద్ధరాజు శ్రీనివాసరాజు, రాయలం మాజీ సర్పంచ్ కోళ్ల రామచంద్రరావు, రాయలం పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ, చిన అమిరం మహేష్, ప్రిన్సిపాల్, స్కూల్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, జనసేన, టీడీపి బిజెపి నాయకులు వీర మహిళలు పాల్గొన్నారు.

# సిసి రోడ్డు నిర్మాణాలను పరిశీలించిన ఎంపీ మహేష్ ,ట్రైకర్ చైర్మన్ బొరగం



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** జీలుగుమిల్లిలోని మీసేవ వీధిలో ఎన్ ఆర్ పి జి ఎస్ నిధులు రూ. 10 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ట్రైకర్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పరిశీలించారు. బుధవారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జన్మదినాన్ని పురస్కరించుకొని బర్రింకలపాడు గ్రామానికి విచ్చేసిన ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, బొరగం శ్రీనివాసులు జీలుగుమిల్లిలో జరుగుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. సిసి రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతన నాణ్యతతో చేపడుతున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వంలో సీసీ రోడ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు ఉండవల్లి సోమసుందరం, మండల అధ్యక్షులు సుంకువల్లి సాయికృష్ణ, గద్దె సుబ్రహ్మణ్యం, ముప్పిడి సురేష్ రెడ్డి, గంధం వెంకటేశ్వరరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 10న కొప్పర్రులో అఖండ అన్న సమారాధన



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** మండలంలోని కొప్పర్రు గ్రామంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా 10వ తేదీ శుక్రవారం అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు, బిజెపి నాయకులు పోలిశెట్టి బులి సత్యం తెలిపారు. భక్తాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉదయం 11 గంటల నుండి అన్న సమా రాధన నిర్వహిస్తామని ఆయన తెలిపారు. గత ఐదేళ్లుగా ఆయనతో పాటు సోదరులు విగ్నేశ్వర రాంబాబు, శ్రీనివాస్‌ల ఆర్థిక సహా యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా పరిసర ప్రాంత గ్రామాల నుండి వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆంజనేయ స్వామి వారి తీర్థ ప్రసాదములు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. ఏకాదశి సందర్భంగా మూడు రోజులపాటు వివిధ కార్యక్రమాలు జరుపుతామని, మొదటిరోజు అఖండ అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని బుల్లి సత్యం తెలిపారు.

## 13వ రోజుకు చేరిన క్రికెట్ టోర్నమెంట్

– ముఖ్య అతిథులుగా హాజరైన కమిషనర్, సర్కిల్ ఇన్స్పెక్టర్





**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** గొర్రెల లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే మెగా క్రికెట్ టోర్నమెంట్ చివరి దశకు చేరుకుంది. 13 రోజులుగా నిర్వహిస్తున్న టెన్నిస్ బాల్ మెగా క్రికెట్ టోర్నమెంటు సెమీఫైనల్స్ చేరుకోగా ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ ఎం ఏసుబాబు,తాడేపల్లిగూడెం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఏ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. టోర్నమెంట్ నిర్వాహకులు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ అతిథులను సత్కరించి మెమెంటోలు అందజేశారు. యువత పక్కదారి పట్టకుండా 55 టీములు ఈ టోర్నమెంట్ లో పాల్గొనడం ఎంతో ఆనందదాయకమని ముఖ్య అతిథులు తెలియజేశారు. పెద్ద సంఖ్యలో క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎంపీపీఎస్ స్కూల్లో విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు





**ఏలూరు,మేజర్ న్యూస్:** వైయస్సార్ నగర్ ఎంపీపీఎస్ స్కూల్లో బుధవారం జరిగిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు జరిగాయి. పోటీలో పాల్గొన్న వారికి,ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్న వారికి ట్రేస్ ఇండియా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ దిడ్ల యాంజిలో సౌజన్యంతో బహుమతి ప్రధానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయిని పీ.లక్ష్మీ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా దిడ్ల యాంజీలో ,స్మార్ట్ సిటీ లైన్స్ క్లబ్ ఏలూరు జెడ్ సిఎంవివి కృష్ణారావు,పాఠశాల ఉపాధ్యాయులు జీ.జే.ఎ. స్టీవెన్, జరీనా బేగం, కిరణ్ కుమారి, విద్యా కమిటీ చైర్మన్ ఎద్దు నాగమణి తదితరులు పాల్గొన్నారు.ఈసందర్భంగా యాంజిలో మాట్లాడుతూ సంక్రాంతి పండగ భారతదేశసంస్కృతి సాంప్రదాయాలకు చిహ్నమని, పంటలు చేతికంది రైతులందరూ సంతోషంగా చేసుకునే పండగని, బంధువులతో, స్నేహితులతో,కలిసి కులమతాలకు అతీతంగా ఈ పండగలో పాల్గొంటారని వివరించారు.ఈ పండగకు ప్రత్యేకత ముగ్గులని,పాఠశాల విద్యార్థుల తల్లులకు ఈ పోటీలు నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జి.జె.ఏ. స్టీవెన్ మాట్లాడుతూ ట్రేస్ ఇండియా సంస్థ ద్వారా పాఠశాలకు అనేక వసతులు కల్పిస్తున్నారని, అనేక విషయాలు పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారని అంటూ దిడ్లయాంజిలో సేవలను కొనియాడారు.

## రావిచర్లను రెవెన్యూ గ్రామంగా ప్రకటించాలి

**- టిడిపి నేత కాపా శ్రీనివాసరావు**



**నూజివీడు,మేజర్ న్యూస్ :** నూజివీడు మండలం రావిచెర్ల గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ప్రకటించాలని గ్రామ సర్పంచ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కాపా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. బుధవారం రావిచెర్ల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నూజివీడు సబ్ కలెక్టర్ బి స్మరణ్ రాజుకు ఈ మేరకు కాపా శ్రీనివాసరావు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాటా ్లడుతూ రావిచెర్ల గ్రామం ఈనాం గ్రామంగా ఉండడంతో రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతు ప్రజల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఈ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ప్రకటించాలని కోరారు. గత వైకాపా పాలనలో మంజూరు చేసిన డి ఫామ్ పట్టాలలో అవకతవకలు జరిగా యని, వీటిని సరిచేసి, సబ్ డివిజన్ చేసి రైతులకు అప్పగిం చాలని కాపా శ్రీనివాసరావు కోరారు. సదరు విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని సబ్ కలెక్టర్ రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహసిల్దార్ రవి కిరణ్‌తో పాటు రెవిన్యూ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు

## పౌష్టికాహార ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం చేయాలి



**భీమడోలు,మేజర్న్యూస్:** పౌష్టికాహార ప్రాముఖ్యత, ప్రయోజనాల గురించి అంగన్వాడీ కేంద్రాలు వేదికలుగా విస్తృత స్థాయి ప్రచారం చేయాలని,ఐసిడిఎస్ ఏలూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.శారద కోరారు. ప్రాజెక్టు డైరెక్టర్ మండలంలో బుధవారం పర్యటించారు. దీనిలో భాగంగా సూరప్పగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని నెంబర్ 1,నెంబర్ 2 అంగన్ వాడి కేంద్రాలను సందర్శించారు. తనిఖీలు నిర్వహించారు. అక్కడ కొనసాగుతున్న వివిధ అంశాల గురించి ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్ పర్యవేక్షకులు నూర్జహాన్ బేగం ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు వివరించారు. అనంతరం ప్రాజెక్ట్ డైరెక్టర్ అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలు, కిశోర్ బాలికలు, గర్భిణీలు బాలింతలతో పాటు పలువురు ఇతరులతో మాట్లాడారు. అంగన్ వాడి కేంద్రాల ద్వారా వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆపై ప్రాజెక్టు డైరెక్టర్ ఐసిడిఎస్ నిధులతో ఎంపిక చేసిన కొన్ని అంగన్వాడీ కేంద్రాలలో కొనసాగుతున్న పోషణ వాటికలలో, ఒకటైన సూరప్పగూడెం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, పెరటి తోటల పెంపకాన్ని పరిశీలించారు. అక్కడ సేంద్రియ ఎరువులతో ప్రత్యేకంగా సాగుతున్న కూరగాయలు ,ఆకుకూరలు తోటలను పరిశీలించారు.వాటిని మరింతగా తీర్చిదిద్దేందుకు తగు సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో అంగన్ వాడి కేంద్రాల కార్యకర్తలు రాజామణి, కల్పనతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## మానవత ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్




**చింతలపూడి,మేజర్న్యూస్:** చింతలపూడి శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో 10 వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎం.ఇ.ఒ.2 ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ తమ దిన చర్యలు ఒక ప్రణాళిక తయారు చేసుకోవాలనీ, ఆ ప్రణాళిక ప్రకారం తమ దినచర్య ఉండాలని అన్నారు. కష్టపడి, మనసు పెట్టి చదివిన వారు మాత్రమే ఉత్తమ ర్యాంకులు సాధించ గలుగుతారనీ అన్నారు.ఈ కార్యక్రమంలో మానవత ఏలూరు జిల్లా కమిటీ జాయింట్ సెక్రటరీ పి.సోమ శేఖరాచార్యులు గారు, ఛైర్మన్ ఎ.అప్పారావు,కన్వీనర్ కె.నాగ చిన్నారావు, ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పి.ఎస్. సుధాకర్, ఉపాధ్యాయులు కె. రమేష్ పాల్గొన్నారు. అనంతరం గత సంవత్సరం 9వ తరగతిలో మొదటి 3 స్థానాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధనోపాధ్యాయులకు వివేకానంద సూక్తులు టేబుల్ స్పైరల్ డిస్ప్లే అండచేయడం జరిగింది.

## నాయకర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలు



**నరసాపురం,మేజర్న్యూస్:** నాయకర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని వలంధర రేవు వద్ద, ఈ నెల 11వ తేదీ శనివారం ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్నట్లు, ట్రస్ట్ నిర్వాహకురాలు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ భార్య సునీత నాయకర్ తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ముగ్గుల పోటీలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని,పోటీలలో విజేతలకు మొదటి, ద్వితీయ,తృతీయ బహుమతులతో పాటు, కంసోలేషన్ బహుమతులు కూడా అందజేస్తామని అన్నారు. అనంతరం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామని, కావున మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె ఒక ప్రకటనలో తెలిపారు.

## మున్సిపల్ పాఠశాలకు గ్యాస్ స్టవ్ బహుకరణ



**పాలకొల్లు,మేజర్ న్యూస్ :** పట్టణ పరిధిలో గల జి వి ఎస్ వి ఆర్ యం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలకు స్టీల్ గ్యాస్ స్టవ్ చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ చవాకుల సూర్య నరేష్ బాబు ద్వారా పాఠశాల ప్రధానోపాధ్యాయులు భవానీప్రసాద్ రాయపూడి వారికి అందజేశారు. ఈ సందర్భంగా దాత నరేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్పిస్తున్న మధ్యాహ్నం భోజన పథకం నిమిత్తం (నూతన మెనూ) కోసం ఈ స్టీల్ గ్యాస్ స్టవ్‌ను ఉపయోగించుకొని విద్యార్థిని విద్యార్థులకు మంచి ఆహారం అందించాలని ,మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాత ల సహకారం ఎంతో అవసరమని. పాఠశాల ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో భాగంగా తమ సేవా సంస్థ సహకారం అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

# నిషేధిత భూముల జాబితాను పునః పరిశీలన చేయాలి



**భీమవరం,మేజర్న్యూస్:** నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములను పున పరిశీలన చేయాలని సిసిఎల్ ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. అమరావతి నుంచి సి సి ఎల్ ఎ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అన్ని జిల్లాల కలెక్టర్లతో బుధవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరయ్యారు. నిషేధిత భూముల జాబితాలో నుంచి తొలగించిన భూములు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయ్యాయా లేదా పరిశీలించాలని జయలక్ష్మి తెలిపారు. ఇప్పటివరకు పశ్చిమగోదావరి జిల్లాలో 57 శాతం పరిశీలన జరిగిందన్నారు. మిగిలిన వాటిని యుద్ధ ప్రాతిపదికన పరిశీలించాలన్నారు. రెవిన్యూ సదస్సులో నమోదైన అర్జీలన్నింటిని సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలని చెప్పారు. ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న భూమి సమస్యలన్నీ పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. పరిష్కారంలో అధికారులు నిర్లిప్తత ప్రదర్శించారదన్నారు. తహసిల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రీ సర్వేలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. నమోదైన అర్జీలు గడువులోగా పరిష్కరించాలని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో ల్యాండ్ సెక్షన్స్ సూపరింటెండెంట్ సిహెచ్.రవి కుమార్, కోఆర్డినేషన్ సెక్షన్ ఇంచార్జ్ సూపరింటెండెంట్ మద్రాపు సన్యాసిరావు పాల్గొన్నారు.

# 10లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి





**– ప్రధానోపాధ్యాయులు అందుకు కృషి చేయాలి : జేసి**

**పెనుమంట్ర, మేజర్ న్యూస్:** బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పదవ తరగతి పర్యపరీక్ష ఫలితాలపై నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు సంబంధించిన ప్రధాన ఉపాధ్యాయులుతో పెనుమంట్ర మండలం మార్టేరు శ్రీ వేణుగోపాల్ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని సమీక్షించారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 మార్చిలో జరగనున్న పదవ తరగతి పరీక్ష ఫలితాలలో విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా స్కూలు ప్రధానో పాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు కొరత ఉన్నట్లయితే పక్క పాఠశాల నుండి తీసుకువచ్చి సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడి సి, డి గ్రేడ్ విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 2024 మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వెనుకబడిన హైస్కూల్లు ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి ఉత్తమ ఫలితాలకు అమలు చేయాలని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం జరిగిన ఎస్.ఏ-1 పరీక్ష ఫలితాలును రివ్యూ చేశారు. మెరిట్ విద్యార్థులు పూర్తి స్కోర్ లను సాధించేలా మార్గ నిర్దేశం చేయాలని ప్రధాన ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. సబ్జెక్టు టీచర్ల సహకారంతో ఈ కార్యశరణ ప్రణాళికను సజావుగా అమలు చేయడానికి ప్రధాన ఉపాధ్యాయులు పూర్తి బాధ్యతని తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ,సర్వ శిక్ష అభియాన్ ఏపిసి పి.శ్యాంసుందర్,ఉప విద్యాశాఖ అధికారి మురళి సత్యనారాయణ,డిసిఇబి సెక్రెటరీ జీవివి శ్రీనివాసరావు, నరసాపురం డివిజన్ పరిధిలోని ఎంఈఓలు, ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న మాండలిన్ వాయిద్య కచేరి





**భీమవరం,మేజర్‌న్యూస్:** భీమవరం త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 106వ త్యాగరాజ ఆరాధనోత్సవాలలో భాగంగా మూడో రోజు ప్రపంచ ప్రఖ్యాత మాండలిన్ వాయిద్య విద్వాంసులు యు రాజేష్ (చెన్నై) మాండలిన్ వాయిద్యం శ్రోతులను ఉర్రూతలూగించాయి. ఆర్యవైశ్య వర్తక సంఘం భవనం కార్యదర్శి తటవర్తి బదిరి నారాయణ జ్యోతి ప్రజ్వలన చేశారు. ముందుగా నాట్యచారణి అంతర్జాతీయ అవార్డు గ్రహీత భానుశ్రీ చేసిన భరతనాట్యం అందరినీ ఆకట్టుకుంది. భానుశ్రీకి డా గంధం విశ్వేశ్వరరావు రూ 10 వేలు నగదు బహుమతిని విద్వాంసులు రాజేష్ చేతుల మీదుగా అందించారు. సుమారు 4 గంటల పాటు శ్రీత్యాగరాజ, ముత్తుస్వామి దీక్షితులు అన్నమాచార్య కీర్తనలు పరవద్బుతంగా రాజేష్ తన వాయిద్యంతో మైమరపించారు. సహ వాయిద్యాలుగా వయొలిన్ బీవీ దుర్గాభవాని ( విజయవాడ), మృదంగం పీ సతీష్ కుమార్ (చెన్నై), ఘటం ఏం హరిబాబు (గుంటూరు) సహకరిం చారు. కార్యక్రమంలో ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు, కారుమూరి ఆదిత్య, చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి, కారుమూరి చినబాబు, గంధం విశ్వేశ్వరరావు, మంతెన రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన రెవిన్యూ సదస్సులు

**– 669 గ్రామాల్లో 8 వరకు నిర్వహణ : జిల్లా కలెక్టర్**

**– 6,453 అర్జీలను స్వీకరించగా ఇప్పటికే 3,312 అర్జీలు పరిష్కారం**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లాలో 669 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా 6,453 అర్జీలను స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. జిల్లాలో 8వ తేదీ వరకు భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరిగిందన్నారు. 669 గ్రామసభల్లో 6,453 అర్జీలను స్వీకరించడం జరిగిందని,వాటిలో ఇప్పటికే 3,312 అర్జీలను పరిష్కరించడం జరిగిందన్నారు.

మిగిలిన అర్జీల పరిష్కారానికి ప్రభుత్వం 45 రోజులు గడువు విధించిందని, నిర్ణీత సమయంలోగా నూరు శాతం అర్జీలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. పరిష్కారం కాని ఆర్జీలు ఎందుకు పరిష్కారంకాలేదో సంబంధిత వ్యక్తులకు లిఖిత పూర్వకంగా తెలియజేయడం జరుగుతుందన్నారు. రెవెన్యూ సదస్సులో ముఖ్యంగా ముటేషన్ – పాసు బుక్కులు జారీ, రీ సర్వేలో భూ వ్యత్యాసాలు, 22 కేసులలో నిషేధిత భూములు తొలగింపు, తదితర భూ సమస్యలపై



ఎక్కువగా అర్జీలను అంద చేయడం జరిగిందని తెలిపారు.

గ్రామ సభలను విజయవంతంగా పూర్తి చేసిన ప్రతి ఒక్క అధికారికి, సభలను సజావుగా నిర్వహించడానికి సహకరించిన జిల్లా ప్రజలకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.

## రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

**– రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్**



**జీలుగుమిల్లి,మేజర్ :** రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని స్వర్ణ వారి గూడెంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తా మని ప్రకటించిందని అయితే ఖరీఫ్ సీజన్ దాటి రబీ సీజన్ వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నా పెట్టుబడి సాయం విధులు విడుదల చేయకపోవడం అన్యాయమని విమర్శించారు. ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం నిధులు వెంటనే విడుదల చేసి రైతులకు అందించాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు వెంటనే ప్రారంభించాలన్నారు.

చింతలపూడి పనులు పూర్తి చేసి మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు అంది ంచాలన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు బిక్కిన వీర సత్యం, జంగారెడ్డిగూడెం మండల అధ్యక్షులు బోడిక రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఆర్ గర్ల్స్ స్కూల్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు





**చింతలపూడి,మేజర్ న్యూస్ :** మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఉద్దేశంతో కళాశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఏపీఆర్ గర్ల్స్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రాహ్మణిశ్వరి అన్నారు.చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం స్కూల్ లో సంక్రాతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. బోగి మంటలు,గాలిపటలు,కొలహాలంగా పండుగను నిర్వహించారు. అరిసెలు,పిండి వంటలు, విద్యార్థులు అందజేసేరు. హరిదా సుని వేషం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూవిద్యార్థులు మనసంప్రదాయలు తెలుసుకోవాలని అన్నారు.

## అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు



**ఇరగవరం,మేజర్‌న్యూస్ :** రాబోయే సంక్రాతిని పురస్కరించుకొని గ్రామాల్లో అవా ంఛనీయ సంఘటనలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తణుకు సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. కృష్ణ కుమార్ హెచ్చరించారు. మండలంలోని రేలంగి పంచాయతీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్కిల్ పరిధిలోని ప్రజలకు సంక్రాతి శుభాకాంక్షలు తెలియజేసారు.వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసే సంస్కృతిక కార్యక్రమాల్లో కోడి పందాలు, పేకాటలు, జూదాలు తదితర కార్యకలాపాలు నిర్వహించినా చర్యలు తప్పవన్నారు. బంధుమిత్రులతో సాంప్రదాయ ఆటపాటలతో జరుపుకోవాలని సూచించారు. అల్లరి మూకల ఆగడాలు అదుపుచేయడానికి తమ సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకు ంటామని చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో అనుమానిత, రౌడీ తదితర కేసులు ఉన్నవారు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు కార్యక్రమంలో ఇరగవరం సబ్ ఇన్ స్పెక్టర్ జనా సతీష్, సిబ్బంది, గ్రామ పంచాయతీ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్ల అభివృద్ధి పనులు పూర్తిచేయాలి





**– గుంతల రహిత జిల్లాగా చేయాలి**
**– జెడ్పి చైర్ పర్సన్ పద్మశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపి మహేష్**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లాలో రూ. 97 కోట్లతో చేపట్టిన ఆర్ అండ్ బి రహదారులు అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లాప్రజా పరిషత్ లో చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగిన స్థాయి సంఘ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి పుట్టామహేష్ కుమార్ మాట్లాడుతూ గుంతలు రహిత ఏలూరు జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కోరారు. జిల్లాలో కీలకమైన ఏలూరు, జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారులతోపాటు మరికొన్ని రహదారుల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. జిల్లాలో కైకలూరు, ఉంగుటూరు, పోలవరం, దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల పరిధిలో 13 రహదారుల మరమ్మత్తులు చేపట్టినట్లు చెప్పారు. కొద్దిపాటి వర్షాలకే బురదబారినపడి ప్రయాణికులు గత 5 సంవత్సరాల్లో ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. వాటిని అధికమించేందుకు కూటమి ప్రభుత్వం రోడ్ల మరమ్మత్తులకు జిల్లాకు రూ.97 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టిందన్నారు. ఆపనులు పూర్తి నాణ్యతతో నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. సంక్రాంతి నాటికి గుంతలు రహిత ఏలూరు జిల్లాగా రూపుదిద్దుకోవాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతిఒక్కరికి అందించే దిశగా అధికారులు కృషిచేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ గోపిమూర్తి, ప్రభుత్వ విప్ తాడేపల్లిగూడెం శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాసరావు, ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి),ఉంగుటూరు శాసన సభ్యులు పత్సమట్ల ధర్మరాజు, నర్సాపురం శాసన సభ్యులు బొమ్మిడి నాయకర్, జెడ్పి సిఇఓ కె.సుబ్బారావు, పలువురు జెడ్పిటిసి సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జ్యోత్స్న సేవలు ప్రశంసనీయం



**ఏలూరు,మేజర్‌న్యూస్:** స్థానిక సెయింట్ థెరెసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగాధిపతిగా పనిచేస్తున్న డాక్టర్ ఏనిర్మల జోత్స్న పదవీ విరమణ చేశారు. ఆమె పదవి విరమణ కార్యక్రమంకళాశాల యాజమాన్యం అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు ఘనంగా నిర్వహించారు. 37సంవత్సరాలుగా కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగంలో సేవలు అందిస్తున్న డాక్టర్ నిర్మల జోత్స్న కళాశాలకు అందించిన సేవలను కళాశాల సుపీరియర్ , కరస్పాండెంట్ మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెస్ కొనియాడారు. ఆమె పదవి విరమణ జీవితం ఆనందంగా సాగిపోవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ పి.మెర్సీ మాట్లాడుతూ డాక్టర్ నిర్మల జ్యోత్స్న కళాశాలలో వివిధ రకాలైన సేవలు అందించారన్నారు. కళాశాల భౌతిక శాస్త్ర విద్యార్థినులు తయారుచేసిన ఎల్ఈడి బల్బులకు వాటికి సంబంధించిన ప్రయోగాత్మక ప్రాజెక్టులకు సమన్వయకర్తగా, మార్గదర్శిగా వ్యవహరించారన్నారు. ఆమె తన పదవీకాలంలో వివిధ రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలకు కూడా రూపకర్తగా నిలిచారని తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినిలు డాక్టర్ జోత్స్నను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ మరియ క్రిస్టియ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సిస్టర్ సుశీల అధ్యాపకులు అభినందించారు. డాక్టర్ జోత్స్న బంధువులు , స్నేహితులు ఈ కార్యక్రమానికి హాజరై అభినందించారు.

# ఇప్పటి వరకు రూ.1 కోటి సిఎం ఆర్ఎఫ్ చెక్కులు అందజేత





**– సిఎం,డిప్యూటీ సిఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బడేటి చంటి**

**ఏలూరు,మేజర్ న్యూస్ :**ఆపద సమయంలో అందించే సాయం అవసరార్థులకు అత్యంత ఉపయుక్తమని ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టం చేశారు. నియోజకవర్గం పరిధిలో ఇప్పటివరకు సుమారు 1 కోటి రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో 9 మందికి 11 లక్షల 74వేల 8వందల రూపాయల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే బడేటి చంటి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ సేవల పరిధిలోకి రాని వైద్యసేవలను కూడా పేదలకు అందాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాయం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు ఏలూరు నియోజకవర్గంలో సుమారు కోటి రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అర్హులకు అందజేసినట్లు ఎమ్మెల్యే చంటి తెలిపారు. ఇందుకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా పైల వెంకట్రావు-25వేలు, బొమ్మన హేమలత-27వేలు,కూరేటి కనకదుర్గ-50,999,షేక్ రిజ్వానా-3,08,615, తుపాకుల ప్రసాద్-రూ.1లక్ష, పాయం లక్ష్మి రూ.4లక్ష బోళ్ల శ్రీనివాస్ 1,07,980, ఉప్పుటూరి వెంకట లక్ష్మి అంజనాదేవి-55,206, చెన్నకేశవుల మంగాదేవి రూ.1లక్ష ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి నగర అధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఒకపక్క అనారోగ్యంతో, ఇంకోపక్క ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోన్న ఎంతోమందికి ముఖ్యమంత్రి సహాయ నిధి సాయం కొండంత ధైర్యాన్నిస్తుందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఇందుకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తోన్న ఎమ్మెల్యే బడేటి చంటికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## జిల్లాలో ముగిసిన రెవిన్యూ సదస్సులు

**– 318 గ్రామాల్లో డిసెంబర్ 13 నుంచి 8 వరకు నిర్వహణ**
**– 4,560 అర్జీలను స్వీకరించగా ఇప్పటికే 1,229 అర్జీలు పరిష్కారం**



**భీమవరం,మేజర్ న్యూస్ :** జిల్లాలో 27 రోజులు పాటు 318 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా 4,560 అర్జీలను స్వీకరించడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో డిసెంబర్ 13 నుండి జనవరి 8 వరకు భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోని 318 గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం 27 రోజులు పాటు నిర్వహించిన గ్రామసభల్లో 4,560 అర్జీలను స్వీకరించడం జరిగిందని, వాటిలో 1,229 అర్జీలను పరిష్కరించగా, ఇంకా 3,331 పరిష్కరించాల్సి ఉందన్నారు. అర్జీల పరిష్కారానికి ప్రభుత్వం 45 రోజులు గడువు విధించిందని, నిర్ణీత సమయంలోగా నూరు శాతం అర్జీలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. పరిష్కారం కాని అర్జీలు ఎందుకు పరిష్కారంకాలేదో సంబంధిత వ్యక్తులకు లిఖిత పూర్వకంగా తెలియజేయడం జరుగుతుందన్నారు. భీమవరం డివిజన్లో 1,333 అర్జీలకు గాను 239, నరసాపురం డివిజన్ 2,079కి 508, తాడేపల్లిగూడెం డివిజన్ 1,148కి 482 అర్జీలను పరిష్కరించడం జరిగిందని తెలిపారు. భీమవరం డివిజన్ మండలాల వారీగా ఆకివీడు 151, భీమవరంలో 270, గణపవరంలో 194, కాళ్ల 98, పాలకోడేరు 194, ఉండి 150, వీరవాసరం 276, నరసాపురం డివిజన్ ఆచంట 159, యలమంచిలి 448, మొగల్తూరు 215, నరసాపురం 441, పాలకొల్లు 155, పెనుగొండ 247, పెనుమంత్ర 204, పోడూరు 210, తాడేపల్లిగూడెం డివిజన్ అత్తిలి 129, పెంటపాడు 127, ఇరగవరం 192, తాడేపల్లిగూడెం 528, తణుకు మండలంలో 172 అర్జీలను గ్రామసభ ద్వారా స్వీకరించడం జరిగిందన్నారు. గ్రామ సభలను విజయవంతంగా పూర్తి చేసిన ప్రతి ఒక్క అధికారికి, సభలను సజావుగా నిర్వహించడానికి సహకరించిన ప్రజలకు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.

## విస్తృతంగా ప్రజల్లోకి సూర్య ఘర్ యోజన ప్రయోజనాలు



**భీమవరం,మేజర్‌న్యూస్:** ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన విస్తృత ప్రయోజనాలను ప్రజలకు సవివరంగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యుత్ శాఖ, నెడ్ క్యాప్ అధికారులతో సమావేశమై జిల్లాలో ప్రధాని మంత్రి సూర్య ఘర్ యోజన అమలుపై సమీక్షించారు. జిల్లాలో సూర్య ఘర్ యోజన పథకం అమలు మందకోడిగా సాగడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు కేవలం 750 మాత్రమే రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేయడం ఏమిటని ప్రశ్నించారు.జిల్లాలో సుమారు 50వేల కనెక్షన్లను లక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని ఆదేశించారు.రానున్న మాసంలో కనీసం 30వేల కనెక్షన్లు అయినా పూర్తి చేయాలన్నారు.ప్రతి ఒక్కరికి సోలార్ విద్యుత్ అవసరం ఉందని,విద్యుత్ ఛార్జీలతో పోలిస్తే సోలార్ వలన చాలా విద్యుత్ ఆదాతో పాటు, విద్యుత్ బిల్లు కూడా తగ్గుతుందని ఈవిషయంలో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని ప్రధాన కూడలిలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేసి సోలార్ ప్యానల్స్‌ను,సోలార్ లైట్స్,తదితర సోలార్ పరికరాలను ప్రదర్శించాలని, ప్రదర్శనకు చూడడానికి వచ్చిన వారికి పూర్తి అవగాహన కల్పించాలన్నారు.ఈ సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఇ ఏ.రఘునాథ బాబు,నెడ్ క్యాప్ డెవలప్మెంట్ మేనేజర్ యు.హరీష్, సంఘ సేవకులు డి. మధుసూదన్ రావు పాల్గొన్నారు.